

అనతి కాలంలోనే
ప్రజల మన్ననలు చూరగొన్న
వన్ నేషన్ దినపత్రికను
చదవండి... చదివించండి....



# వన్ నేషన్

RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

సంపుటి: 16 సంచిక: 343 ఎడిటర్: కె.యువరాజ్ మంగళవారం 22-9-2026 పేజీలు: 4 వెల: రూ.3/-



వన్ నేషన్
దినపత్రికను
ఆదరిస్తున్న పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
శ్రేయోభిలాషులకు
మా హార్థిక
శుభాకాంక్షలు





- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిపై సీఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి గ్రీన్ చానల్‌లో నిధులు మంజూరు చేస్తున్నా పనులు వేగంగా ఎందుకు జరగడం లేదని అధికారులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే 30 రోజులూ 24 గంటలూ పనులు జరగాలని, ఆ మేరకు వర్క్ షెడ్యూల్ తయారు చేసుకుని ముందుకు వెళ్లాలని నిర్దేశించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంపై సోమవారం రాత్రి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎంవో అధికారులు నిరంతరం క్షేత్రస్థాయికి వెళ్లి సమీక్ష చేయాలని, ప్రత్యేక అధికారులను నియమించి పనులను పర్యవేక్షించాలని చెప్పారు. ప్రతి పనికి ఒక ప్రత్యేక అధికారికి బాధ్యత అప్పగించాలని, ఇక నుంచి ప్రతి రోజు కలెక్టర్ ఆస్పత్రి పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. సనత్ నగర్ టిమ్స్ తరహాలో వరంగల్‌లోనూ త్వరలోనే ఓపీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని, ఆస్పత్రి చుట్టూ మంచి వాతావరణం ఉండేలా పరిసరాల్ని తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే, సనత్ నగర్ టిమ్స్‌లో తక్షణమే స్టాఫ్ క్వార్టర్స్ పనులు ప్రారంభం కావాలన్నారు. ఆస్పత్రి నిర్వహణను ఏజెన్సీకి అప్పగించాలని నిర్దేశించారు. వరంగల్‌లో భూగర్భ డ్రైనేజీని భారీ నిధులతో నిర్మిస్తున్నందున పనులను పకడ్బందీగా చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్ అభివృద్ధి పనులపై సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు.

# ఉపాధ్యాయులపై రౌడీలను ఎగదోస్తారా?

- ఈ దాడులను చూస్తూ ఊరుకోం: సీఎం



**కుప్పం, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** వైసీపీ రౌడీలు.. గురువులపై దాడి చేస్తున్నారని.. ఇలాంటివి చూస్తూ ఊరుకోబోమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై అవసరమైతే కోర్టులకు వెళ్లవచ్చని.. కానీ ఉపాధ్యాయులపైకి రౌడీలను ఎగదోస్తున్నారని మండిపడ్డారు. రాజధాని అమరావతి అభివృద్ధి చెందుతుంటే చూడలేక కుట్రలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ధైర్యముంటే జే బ్రాండ్స్‌పై.. వైసీపీ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ అవకతవకలపై గొడ్డలి పార్టీ సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. చిత్తూరు జిల్లాలోని తన సొంత నియోజకవర్గం కుప్పంలో రెండ్రోజుల పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం బహిరంగ సభలో మాట్లాడారు. డీఎస్సీ ఉద్యోగాలు తమ కష్టార్జితమని టీచర్లంతా నినదిస్తున్నారని.. ఫేక్ పార్టీ అందరినీ ఫేక్ అంటే సహించేది లేదని విజయవాడలో స్పోర్ట్స్ టీచర్లు ఆందోళన చేస్తుంటే వైసీపీ రౌడీలు దాడి చేయడం ఏమిటని ధ్వజమెత్తారు. 'సీబీఎన్ జారీ చేసిన డీఎస్సీ నోటిఫికేషన్లలో అవినీతి జరగదు. నా హయాంలో ఎప్పుడూ పేపర్ లీక్ కాలేదు.

ఎన్నో డీఎస్సీలు, ఎన్నో ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహించాం. ఎప్పుడూ తప్పులు జరగలేదు. 14 సార్లు డీఎస్సీలు పెట్టాం. చిన్న పొరపాటు కూడా లేకుండా పరీక్షలు నిర్వహించాం. మెగా డీఎస్సీ-2025పై గొడ్డలి పార్టీ చేసిన ప్రతి ఆరోపణకూ సమాధానం చెప్పాం. ఇద్దరు మహిళా అధికారులు దీటుగా జవాబిచ్చారు. చట్టబద్ధంగా జరిగిన ప్రక్రియపై అవసరమైతే కోర్టులకు వెళ్లొచ్చు. కానీ దాడులేంటి? ఉపాధ్యాయులపైకి రౌడీలను ఎగదోయడమేంటి? అసెంబ్లీకి వచ్చి చర్చిస్తే సాక్ష్యాధారాలతో నోళ్లు మూయిస్తాం. వాస్తవాలతో బట్టలూడదీస్తాం' అని తేల్చిచెప్పారు. జగన్ ప్రభుత్వం సర్టిఫికెట్లు ఇచ్చిన క్రీడాకారులకు ఉద్యోగాలిస్తే, వారినీ ఫేక్ అంటున్నారని ఆక్షేపించారు. 'వాళ్లిచ్చిన సర్టిఫికెట్లతో ఉద్యోగాల్లోకి వచ్చిన వారిని కూడా ఫేక్ అంటున్నారు. గురువులపై గొడ్డలి పార్టీ రౌడీలు దాడి చేశారు. ఇది చూస్తుంటే బాధ, ఆవేదన కలుగుతున్నాయి. తమపై

4లో

# డి ఎమ్ జె ఎ సేవలు అవసరం

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు




**శ్రీకాకుళం, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** దేశవ్యాప్తంగా, తెలుగు రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న డిజిటల్ మీడియా జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా ఏర్పాటైన డిజిటల్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ (DMJA) అధికారిక లోగోను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ వేలూరి శివకుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి గొండ్యాల దుర్గాప్రసాద్ ,ఏపీ ప్రెసిడెంట్ డాక్టర్ డాక్టర్ బాదాన దేవభూషణరావు, జాయింట్ సెక్రటరీ జనరల్ వై. గాయత్రి రెడ్డి పాల్గొని కేంద్ర మంత్రితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. డిజిటల్ మీడియా ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులు, ఫీల్డ్ రిపోర్టర్ల సమస్యలు, అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణను కేంద్ర మంత్రికి వివరించారు. ఈ వివరాలను సావధానంగా విన్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో కష్టపడే డిజిటల్ వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం తరపున ప్రోత్సాహం కల్పిస్తామని బరోసా ఇచ్చారు. అనంతరం జాతీయ అధ్యక్షులు వేలూరి శివకుమార్ మాట్లాడుతూ, డిజిటల్ జర్నలిజంలో పారదర్శకత, బాధ్యతను పెంపొందించేందుకు సంస్థను కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (వీజూా) వద్ద సెక్షన్ 8(1) కింద లైసెన్స్ నెం. 164827, రిజిస్ట్రేషన్ నెం. U88900TS2025NPL194539 తో అధికారికంగా నమోదు చేసినట్లు తెలిపారు. కేంద్ర సమాచార ప్రసార శాఖ (MIB) గుర్తింపు పొందిన వర్కింగ్ జర్నలిస్ట్ మీడియా కౌన్సిల్ (WJMC) సెల్ఫ్-రెగ్యులేటరీ బాడీ నిబంధనలు, ఐటీ రూల్స్ 2021 ఎథిక్స్ కోడ్‌ను అసోసియేషన్ ఖచ్చితంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. నకిలీ ఐడీ కార్డులను పూర్తిగా అరికట్టేందుకు www.dmja.org పోర్టల్ ద్వారా డైనమిక్ క్యూఆర్ కోడ్ (ఉ= జశీంవ) ఆధారిత ఐడీ కార్డుల వ్యవస్థను తీసుకొచ్చినట్లు వెల్లడించారు. అర్హులైన జర్నలిస్టులకు ప్రమాద బీమా, రైల్వే, బస్సు పాసులు, అక్రిడిటేషన్లలో న్యాయమైన ప్రాధాన్యత కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద గళం విప్పుతామని నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ముఖ్య ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.




అధికారికంగా ప్రారంభించిన సంస్థ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** అమెరికన్ టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. భారత్‌లో తన నాలుగో క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో సోమవారం అధికారికంగా ప్రారంభించింది. భారత్‌లో డిజిటల్, కృత్రిమ మేధ (ఏఐ) మౌలిక వసతుల అభివృద్ధి కోసం కంపెనీ గతంలో ప్రకటించిన 2,050 కోట్ల డాలర్ల (సుమారు రూ. 1.95 లక్షల కోట్లు) పెట్టుబడుల ప్రణాళికలో భాగంగా మైక్రోసాఫ్ట్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. కంపెనీకి భారత దక్షిణ మధ్య క్లౌడ్ రీజియన్ అయిన ఈ కేంద్రం.. గత నెల 6వ తేదీనే అందుబాటులోకి వచ్చింది. మైక్రోసాఫ్ట్ ఇప్పటికే పుణె, చెన్నై, ముంబైలో క్లౌడ్ రీజియన్‌లను ఏర్పాటు చేసింది. కొత్తగా ఏర్పాటు చేసిన హైదరాబాద్ క్లౌడ్ రీజియన్‌లో కూలింగ్ కోసం నీటికి బదులు ఎయిర్ కూల్డ్ చిల్లర్స్‌పై ఆధారపడుతున్నట్లు మైక్రోసాఫ్ట్ ఇండియా, దక్షిణాసియా ప్రెసిడెంట్ పునీత్ చందోక్ తెలిపారు. దేశంలో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ సేవల కేంద్రం ఇదేనని ఆయన అన్నారు. హైదరాబాద్ క్లౌడ్ రీజియన్‌ను మైక్రోసాఫ్ట్ మూడు జోన్ల ఆర్కిటెక్చర్‌తో అభివృద్ధి చేసింది. మిషన్ క్రిటికల్, ఏఐ వర్క్‌లోడ్స్‌కు మద్దతిచ్చేలా డిజైన్ చేసింది. భారత్‌లోని తమ అన్ని డేటా సెంటర్లు ఏఐ ఎనేబుల్డ్, ఏఐ క్యాపబుల్ హార్డ్‌వేర్, అధిక సామర్థ్యంతో కూడిన కూలింగ్ వ్యవస్థలను కలిగి ఉండటంతో పాటు ఆధునిక ఏఐ వర్క్‌లోడ్స్ నిర్వహణకు అనుకూలంగా ఉన్నాయని మైక్రోసాఫ్ట్ తెలిపింది. హైదరాబాద్ కేంద్రంలో అదనంగా అజూర్, ఏఐ సేవలందించే ఆలోచన ఉందని సంస్థ వెల్లడించింది.


వన్ నేషన్
RNI NO. APTEL/2010/33523 తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ విలువలతో
కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై
అవగాహన కలిగిస్తూ ప్రజల పక్షాన నిలబడాలని



అనుకుంటున్నారా?
బాధ్యతయుతమైన జర్నలిజంలో
రాణించాలనుకుంటున్నారా?
అయితే రండి...



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల
వ్యాప్తంగా జిల్లాలు, మండలాల
వారీగా పనిచేసే విలేకరులు
కావలెను.

9948222240

# పద్మావతి ప్లాజాలో ఘనంగా రక్తదాన శిబిరం

## - రక్తదానం ప్రాణదానంతో సమానం - ఆరోగ్యవంతులు ముందుకు రావాలి

**కూకట్‌పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** రక్తదానం ప్రాణదానంతో సమానమనే సందేశంతో కూకట్‌పల్లి కేపీహెచ్‌బీలోని పద్మావతి ప్లాజాలో వినాయక నవరాత్రుల సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సహాయం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన పద్మావతి ప్లాజా నిర్వాహకులను తలసీమియా ఒ సికిల్ సెల్ సొసైటీ, హైదరాబాద్ ప్రతినిధులు అభినందిస్తూ స్మారక పురస్కారాన్ని అందజేశారు. రక్తదానం ద్వారా ఒకరి ప్రాణాన్ని కాపాడే అవకాశం ఉంటుందని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. సేఫ్ బ్లడ్ ఫర్ అల్ అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శివకృష్ణ--న్యూ వెంకటేశ్వర మొబైల్స్, రాఘవ--రవిచంద్ర మొబైల్స్, భాస్కర్--భాస్కర్ మొబైల్స్, వెంకట్‌రెడ్డి--ఏ.జె. మొబైల్స్, ప్రసాద్--ప్రసాద్ మొబైల్ ఫిక్సర్, జొన్నాడ సతీష్, రాజేష్ బాంబే డైయింగ్ ,తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

**ఎల్బీనగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 21 (వన్ నేషన్):** లింగోజిగూడ డివిజన్ నందు కాలనీ అసోసియేషన్ సభ్యులతో ఆత్మీయ సమావేశం. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్‌లో పలు కాలనీల అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ శాసనసభ్యులు



దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కాలనీ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కృషితో అనేక అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యాయని గుర్తు చేశారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ,వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా కొన్ని కాలనీలలో డ్రైనేజీ సమస్యలు,రోడ్ల మరమ్మతులు వంటి సమస్యలు ఇంకా ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కాలనీ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి,భారస నాయకులు వెంకటేశ్వరరావు,తిలక్ రావు,జగన్నాథ్ రెడ్డి,తోట రాజశేఖర్ రెడ్డి,రాకేష్ ఠాగూర్,గంగపుత్ర భాస్కర్,నరసింహగుప్త, ఇంద్రజి, శ్రీధర్, దయానంద్, ఆశిష్, పార్వతి,దేవి,ప్రభావతి మరియు డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు,ఉద్యమకారులు,మహిళలు,పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

## -కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కూరేళ్ళ శ్రీరాములు

**మోత్కూరు, సెప్టెంబర్ 21 (వన్ నేషన్):** విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని మోత్కూర్ మండల పరిషత్ లో సోమవారం నిర్వహించిన గ్రీవేన్స్ డే లో కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కూరేళ్ళ శ్రీరాములు ఎంపీడీఓ బాలాజీ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. నర్సరీ,ఎల్ కె జి, యు కేజీ లకు రూ.40 వేల నుండి



50 వేలు, ఒకటవ తరగతి నుండి 10 వ తరగతి వరకు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని,పుస్తకాల పేరుతో రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారని, విద్యా భోదనకు క్వాలిఫైడ్ టీచర్లు లేరని, విద్యా శాఖ ఆదేశాల మేరకు ఏ తరగతి కి ఎంత ఫీజు అన్న బోర్డు లేదని , విద్యా బోధన చేసే టీచర్ల విద్యార్హతలతో కూడిన బోర్డు లేదని అధికారులు స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం లో పేర్కొన్నారు.

# పారిశ్రామిక విధానంపై విద్యార్థుల్లో అవగాహన ఉండాలి

**ఎమ్మిగనూరు : సెప్టెంబర్ 21 (వన్ నేషన్):** పారిశ్రామిక విధానంపై విద్యార్థుల్లో అవగాహన అవసరమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (వివర్స్ కాలనీ) ప్రధానోపాధ్యాయులు బి నాగభూషణ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (వీవర్స్ కాలనీ) వృత్తి విద్యా విద్యార్థులు కలగొట్ల గ్రామంలోని అమరావతి ఆయిల్ మిల్‌ను పారిశ్రామిక సందర్శనలో భాగంగా సందర్శించారు. ఈ సందర్భంగా




విద్యార్థులు నూనె తయారీ ప్రక్రియ, ముడి పదార్థాల వినియోగం, ప్యాకేజింగ్, నిల్వ, మార్కెటింగ్ , రిటైల్ కార్యకలాపాలను ప్రత్యక్షంగా పరిశీలించి అవగాహన పొందారు. అమరావతి ఆయిల్ మిల్ యజమాని చెరుకు రమేష్ విద్యార్థులకు పరిశ్రమలోని తయారీ, ప్యాకేజింగ్ , మార్కెటింగ్ ప్రక్రియలను వివరించారు. ఈ సందర్శన ద్వారా విద్యార్థులకు పరిశ్రమల పనితీరు, రిటైల్ రంగం మరియు ఉద్యోగ నైపుణ్యాలపై ప్రత్యక్ష అవగాహన లభించింది.కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఎం. ఈరన్న, ఎం. సునీత, ఎం. సుధాకర్, కె. కిరణ్ కుమార్ , ఆర్ట్ ఉపాధ్యాయులు వి. నాగరాజరావు, అలాగే వృత్తి విద్యా శిక్షకులు సి.వి. శ్రీహరి (రిటైల్), కట్టుబడి వంశీ (ఆటోమోటివ్) పాల్గొన్నారు.

# వనస్థలి కార్పెంటర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**ఎల్బీనగర్ ప్రతినిధి, సెప్టెంబర్ 21 (వన్ నేషన్):** రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని వనస్థలిపురం లో వనస్థలి కార్పెంటర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వనస్థలిపురం సచివాలయ నగర్ కాలనీ రాఘవేంద్ర స్వామి గుడి ప్రక్కన నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల కార్యక్రమంలో ఆరవ రోజైనా ఆదివారం స్వామి వారి సన్నిధిలో అన్నదాన కార్యక్రమాన్ని బ్రహ్మాండంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి



అసోసి యేషన్ వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు కాలనీవా సులు అధిక సంఖ్యలో హాజరై గణేష్ కి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి స్వామివారి అన్నదాన ప్రసాదాలను స్వీకరించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వేద పండితులతో విఘ్నేశ్వరుడికి ఘనంగా పూజలు నిర్వహించడం, అన్నదాన కార్యక్రమం, పలువురు రాజకీయ నాయకుల ప్రముఖుల సందర్శన హడావిడిగా కొనసాగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, ముద్దగౌడ్ లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ లు విచ్చేసి గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసోసియేషన్ వారు 31 సంవత్సరాలుగా వినాయక ఉత్సవాలను నిర్వహించడూ అభినంద నీయంని వారు పేర్కొన్నారు. శీల బోయిన పుండరీ కాక్షుడు ఝాన్సీ లక్ష్మి దంపతుల కుటుంబ సభ్యులు విగ్రహ దాతలు కాగా అసోసియేషన్ ప్రతి సభ్యుడు బాధ్యతగా తీసుకుని మిగతా అన్ని కార్యక్రమ ఏర్పాట్లను సజావుగా నిర్వహించినట్లు అసోసియేషన్ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం అసోసియేషన్ అధ్యక్షులు శంకారపు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి చింతపల్లి గణబాబు, కోశాధికారి కొప్పిశెట్టి సూర్యనారా యణ ల ఆధ్వర్యంలో నిర్వహించగా అసోసియేషన్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫలక్‌నుమా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# ఘనంగా హిందీ దినోత్సవ వేడుకలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** ఫలక్ నుమా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ దినోత్సవ వేడుకలను ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం హిందీ విభాగాధ్యక్షురాలు ప్రొఫెసర్ డబ్ల్యూ. మాయాదేవి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. డా. సంగీత కోటియా విశిష్ట అతిథిగా పాల్గొని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. ప్రవీణ్ కుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ముఖ్య అతిథి ప్రొఫెసర్ డబ్ల్యూ. మాయాదేవి మాట్లాడుతూ హిందీ కేవలం సాహిత్యం, భావ వ్యక్తీకరణకు సంబంధించిన భాష మాత్రమే కాదని, అనేక రంగాల్లో ఉపాధి అవకాశాలను అందించే భాష అని అన్నారు. హిందీ విద్యార్థులకు రాజభాష అధికారి వంటి ఉద్యోగాలతో పాటు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్య ద్వారానే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుం దని పేర్కొన్నారు. విశిష్ట అతిథి డా. సంగీత కోటియా విద్యార్థులను ఉద్దేశించి చిన్ననాటి కథ “ఒక కాకి దాహంతో ఉంది... కుండలో కొద్దిగా నీరు ఉంది” అనే కథను ఉదాహరణగా చెబుతూ, జీవితంలో ఎన్ని కష్టాలు ఎదురైనా నిరాశ చెందకుండా నిరంతరం ప్రయత్నం చేయాలని సూచించారు. లక్ష్యాన్ని సాధించడానికి పట్టు దల, సహనం, తెలివితేటలు ఎంతో అవసరమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ “ఢాయీ ఆఖర్ ప్రేమ్ కా, పడే సో పండిత్ హోయ్” అనే కబీర్ వాక్యాన్ని ఉదహరిస్తూ ప్రేమ, సోదరభావం, పరస్పర సహకారంతో జీవించాలని



విద్యార్థులకు సూచించారు. భాష, మతం, ప్రాంతం వంటి భేదాలను పక్కనపెట్టి అందరితో కలిసి మెలిసి ఉండాలని, సామాజిక ఐక్యతను పెంపొందించాలని అన్నారు.

కార్యక్రమ సమన్వయకర్త, హిందీ విభాగానికి చెందిన డా. బాబురావు అతిథులను స్వాగతిస్తూ మాట్లాడుతూ, ఉస్మానియా విశ్వవిద్యాలయం హిందీ విభాగానికి చెందిన ఈ ఇద్దరు ప్రముఖుల హాజరుతో హిందీ దినోత్సవ కార్యక్రమానికి మరింత ప్రత్యేకత వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలలోని అన్ని విభాగాలకు చెందిన ప్రాధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులు వివిధ సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని హిందీ భాష పట్ల తమ ఆసక్తిని, అభిమానాన్ని చాటుకున్నారు. హిందీ భాష ప్రాముఖ్యత, ఉపాధి అవకాశాలు, మహిళా విద్య, విద్యార్థుల లక్ష్యసాధన, నిరంతర కృషి, సామాజిక ఐక్యత వంటి అంశాలపై అతిథులు మరియు కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. మొత్తంగా హిందీ దినోత్సవ వేడుకలు హిందీ భాష పట్ల గౌరవం, అభిమానం మరియు ఉత్సాహంతో విజయవంతంగా ముగిశాయి.

# ఆర్మీ సైనికులకు ‘మై గిఫ్ట్’ ఆత్మీయ సత్కారాలు..

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** నీవు అద్దమైనా కావాలి. నీవు దీపమైనా కావాలి” అనే స్ఫూర్తిదాయక నినాదంతో సేవా పథంలో ముందుకు సాగుతున్న ‘మై గిఫ్ట్’ యువ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన ఆర్మీ సైనికులకు భాగ్యనగరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆత్మీయ సత్కారాలు అందజేశారు. అందరం బతకాలి అందరం



ఎదగాలి” అనే సదుద్దేశంతో మారుమూల ప్రాంతాల్లో మార్పునకు బాటలు వేయాలనే సంకల్పంతో బహుభాషావేత్త, కవి, రచయిత డా పెరుక రాజు 2000 సంవత్సరంలో తన స్వగ్రామంలో ‘మై గిఫ్ట్’ సంస్థను స్థాపించారు. మారుమూల గ్రామంలో మొలకెత్తిన ‘మై గిఫ్ట్’ సేవా ప్రస్థానం నేడు దేశం నలుమూలలా విస్తరిస్తూ, సేవతో పాటు జాతీయతా స్ఫూర్తిని చాటుతోంది. డా పెరుక రాజు తన స్వగ్రామంలోని పాఠశాలకు అవసరమైన ఫర్నీచర్ సమకూర్చడంతో పాటు ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేశారు.

# ప్రపంచంపై 'భారత్' విద్యా నిర్ణయాల ప్రభావం

**- ఇంటర్నేషనల్ బాక్యూలరేట్ (ఐబీ) డైరెక్టర్ జనరల్ ఒల్లీ-పెక్కా హైనోనెన్ - అగా ఖాన్ అకాడమీ హైదరాబాద్ లో 'ఐబీ మంథన్ 2026'**



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** భారతదేశ విస్తృతి, వైవిధ్యం దృష్ట్యా ఇక్కడ విద్యా రంగంలో తీసుకునే నిర్ణయాలు ప్రపంచవ్యాప్తంగా పెను ప్రభావం చూపుతాయని ఇంటర్నేషనల్ బాక్యూలరేట్ (ఐబీ) డైరెక్టర్ జనరల్ ఒల్లీ–పెక్కా హైనోనెన్ తెలిపారు.




శంషాబాద్ ఎయిర్ పోర్ట్ దగ్గర, కుర్మలగూడ, హార్డ్‌వేర్ పార్క్ వద్ద ఉన్న అగా ఖాన్ అకాడమీ హైదరాబాద్ లో 'హద్దులు దాటిన అభ్యసనం: పరస్పర అనుసంధానిత ప్రపంచం కోసం విద్య' అనే ఇతివృత్తంతో 'ఐబీ మంథన్ 2026' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దేందుకు అవసరమైన విద్యా పునాదులు, జిజ్ఞాస, విచక్షణ, పరిస్థితులకు అనుగుణంగా మారే తత్వం, బాధ్యతాయుత దృక్పథాన్ని ఇక్కడి యువతలో నింపేందుకు అపారమైన అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రపంచంతో ఎలా మమేకం కావాలో తెలుసుకుంటూ, సమాజం, ప్రాంతం, దేశం గురించి తెలుసుకోవడంలో ఎంతో విలువ ఉందన్నారు. భారతదేశంలో ఐబీ కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరగడానికి ఇది కూడా ఒక ముఖ్య కారణమన్నారు. ఇవి విద్యాపరమైన ప్రమాణాలతో పాటు పరిశోధనాత్మక దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, నేర్చుకున్న అంశాలను సరికొత్త పరిస్థితుల్లో అన్వయించే సామర్థ్యాన్ని మిళితం చేస్తాయన్నారు. తద్వారా వేగంగా మారుతున్న ప్రపంచంలో రాణించేందుకు అవసరమైన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, అనుకూలతలను పెంపొందించుకోవడంలో యువతకు ఎంతగానో తోడ్పడతాయన్నారు.

ఈ 'ఐబీ మంథన్ 2026'లో దేశవ్యాప్తంగా ఉన్న ఇంటర్నేషనల్ బాక్యూలరేట్ (ఐబీ) పాఠశాలలకు చెందిన దాదాపు రెండు వందల మంది విద్యావేత్తలు, పాఠశాల నాయకులు హాజరయ్యారు. వృత్తిపరమైన చర్చలు, ఆలోచనల మార్పిడి, పరస్పర అవగాహన కోసం ఈ ఒకరోజు సదస్సు నిర్వహించారు. వేగంగా మారుతున్న ప్రపంచాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేలా యువతను తీర్చిదిద్దుతూ, పాఠశాలల విద్యార్థుల స్వీయ చొరవ, మూల్యాంకనం, సమ్మిళితత్వం, నాయకత్వాన్ని ఏ విధంగా బలోపేతం చేయవచ్చో పరిశీలించాలని ఈ సదస్సులో ప్రతినిధులను కోరారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఇంటర్నేషనల్ బాక్యూలరేట్ సౌత్ ఆసియా, జపాన్ విభాగం హెడ్ డాక్టర్ ఆశిష్ త్రివేది, అకాడమీ హెడ్ డాక్టర్ జోనాథన్ లాంగ్ పాల్గొన్నారు. రెండు విడతలుగా జరిగిన బ్రేక్‌అవుట్ సెషన్లలో విద్యార్థుల స్వీయ చొరవ, మూల్యాంకనం, సమ్మిళితత్వం, నాయకత్వం, పరస్పర అనుసంధాన పాఠశాల వర్గాల అభివృద్ధి వంటి అంశాలపై ప్రతినిధులు చర్చించారు. ఈ సమావేశాలు విద్యా సూత్రాల చర్చతో పాటు తరగతి గది ఆచరణాత్మక పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించేలా సాగాయి. 'వెన్ లెర్నర్స్ లీడ్ దేర్ లెర్నింగ్: ఫ్రమ్ ప్యాషన్ అండ్ పర్పస్ టు యాక్షన్ అండ్ ఇంపాక్ట్' అనే సెషన్‌లో విద్యార్థులు తమ చదువుపై అర్థవంతమైన బాధ్యతను తీసుకునేలా పాఠశాలలు ఎలాంటి అనుకూల వాతావరణాన్ని కల్పించవచ్చో చర్చించారు. 'దే గాట్ ది ఆన్సర్. డిడ్ దేర్ థింకింగ్ చేంజ్?' అనే మరో సెషన్‌లో కేవలం విద్యార్థి చెప్పిన సమాధానం సరైనదా? కాదా? అన్నదానిపైనే దృష్టి పెట్టకుండా, వారి దృక్పథం, భావనలపై అవగాహన, ఆలోచనా సరళిలో వచ్చిన మార్పులను మూల్యాంకనం ద్వారా ఎలా గుర్తించవచ్చో అసలైన విద్యార్థుల స్పందనల ఆధారంగా పరిశీలించారు.

మధ్యాహ్నం జరిగిన రెండు ప్యానెల్ చర్చలు 'లెర్నర్ పర్స్పెక్టివ్స్', 'లీడర్‌షిప్ అండ్ ఇంప్లిమెంటేషన్'లో విద్యావేత్తలు, ఐబీ పూర్వ విద్యార్థులు, నిపుణులు, విద్యా రంగ నాయకులను ఒకచోట చేర్చాయి. ఐబీ విద్య దీర్ఘకాలిక ప్రభావంతో పాటు విద్యా దార్శనికతను నిరంతర ఆచరణగా మార్చడానికి అవసరమైన కార్యాచరణపై ఈ ప్యానెల్స్ దృష్టి సారించాయి.

ప్రతినిధులు తమ పాఠశాలల్లో అమలు చేయదగిన ఆలోచనలు, వ్యూహాలను సమీక్షించుకోవడంతో పాటు ఐబీ కమ్యూనిటీ అంతటా నూతన వృత్తిపరమైన సంబంధాలను ఏర్పరుచుకోవడంతో ఈ కార్యక్రమం ముగిసింది.

'మథనం' అంటే 'లోతైన ఆలోచన' అనే అర్థాన్ని సూచిస్తూ, ఇప్పటికే ఉన్న పద్ధతులను ప్రశ్నించడం, పంచుకున్న అభ్యసనాన్ని కార్యాచరణగా మార్చడంపై ఈ కార్యక్రమం పెట్టిన దృష్టికి 'మంథన్' అనే పేరు సార్థక నామధేయం అయినది.

### అగా ఖాన్ అకాడమీ హైదరాబాద్ గురించి

అగా ఖాన్ అకాడమీ హైదరాబాద్ ఒక ఇంటర్నేషనల్ బాక్యూలరేట్ (ఐబీ) వరల్డ్ స్కూల్. దివంగత హైనెస్ ప్రిన్స్ కరీం ఆగాఖాన్ 4 స్థాపించిన అకాడమీల నెట్‌వర్క్‌లో ఇది రెండవది. ఈ అకాడమీ ఐబీ ప్రైమరీ ఇయర్స్, మిడిల్ ఇయర్స్, డిప్లొమా ప్రోగ్రామ్‌లను అందిస్తూ, విద్యార్థులను నాయకత్వం, సేవా గుణాలతో కూడిన జీవితాలకు సిద్ధం చేస్తుంది. ఆగా ఖాన్ అకాడమీలు అగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్‌కు చెందిన ఒక విభాగమైన 'అగా ఖాన్ ఎడ్యుకేషన్ సర్వీసెస్'లో భాగంగా ఉన్నాయి. మరిన్ని వివరాల కోసం WWW.AGAKHANACADEMIES.ORG/ HYDERABAD వెబ్‌సైట్‌ను సందర్శించండి.

### ఇంటర్నేషనల్ బాక్యూలరేట్ గురించి

ఇంటర్నేషనల్ బాక్యూలరేట్ 3 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల 19.5 లక్షల (1.95 మిలియన్ల) కంటే ఎక్కువ మంది విద్యార్థులకు నాలుగు విద్యా కార్యక్రమాలను అందిస్తోంది. ఆగస్టు 2026 నాటికి, ప్రపంచవ్యాప్తంగా 160కి పైగా దేశాలలోని 6,200 కంటే ఎక్కువ పాఠశాలల్లో 9,100కు పైగా ఐబీ ప్రోగ్రామ్‌లు నిర్వహించబడుతున్నాయి. మరింత సమాచారం కోసం WWW.IBO.ORG వెబ్‌సైట్‌ను సందర్శించండి. మరింత సమాచారానికి దయచేసి సంప్రదించండి : 9959154371 / 9963980259



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్): ఓల్డ్ బోయిన్‌పల్లిలో నిర్వహించిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, నుచ్చు శివ యాదవ్ పాల్గొని, భక్తులతో కలిసి నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు.**

# శ్రీనగర్ కాలనీలో నిఖిల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించిన మాజీ ఎంపీ డాక్టర్ జి. రంజిత్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** నగరంలో గత 44 ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్న నిఖిల్ హాస్పిటల్స్, అడ్వాన్స్డ్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ మరియు న్యూరో ఇంటర్వెన్షనల్ కేర్ సేవల కోసం ప్రత్యేకంగా "నిఖిల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ (NHI)" ని ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభించింది. శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్డులోని నిఖిల్ హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన ఈ నూతన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను మాజీ లోక్‌సభ సభ్యులు శ్రీ డాక్టర్ జి. రంజిత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సేవలు దిల్‌సుఖ్‌నగర్‌లోని గడ్డిఅన్నారం క్రాస్ రోడ్స్ ఉన్న హాస్పిటల్ శాఖలో కూడా అందుబాటులో ఉంటాయని యాజమాన్యం తెలిపింది.



ఈ సందర్భంగా మాజీ ఎంపీ డాక్టర్ జి. రంజిత్ రెడ్డి మాట్లాడుతూ, "నాలుగు దశాబ్దాలకు పైగా నిఖిల్ హాస్పిటల్స్ ప్రజలకు నమ్మకమైన వైద్య సేవలు అందిస్తోంది. ప్రస్తుత కాలంలో అత్యంత ఆధునిక సాంకేతికతతో కూడిన నిఖిల్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం. ఈ నియోజకవర్గంలో మెరుగైన ఉచిత, అత్యవసర వైద్య సేవలు అందడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (DMHO) శ్రీ డాక్టర్ పుట్లా శ్రీనివాస్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. సోమాజిగూడ డివిజన్ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ శ్రీమతి వనమ్ సంగీత యాదవ్, నిఖిల్ హాస్పిటల్స్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అమిత సుంకరినేని ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

ఆధునిక క్యాథ్ ల్యాబ్, స్మార్ట్ కార్డియాక్ ఐసీయూ: ఈ సందర్భంగా సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ నిశాంత్ సుంకరినేని మాట్లాడుతూ, గుండెపోటు వంటి అత్యవసర సమయాల్లో ప్రతీ సెకను కీలకమని, అందుకే నిమిషాల్లో రోగ నిర్ధారణ చేసి చికిత్స అందించేలా హై–ఎండ్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ క్యాథెటరైజేషన్ ల్యాబ్, స్మార్ట్ కార్డియాక్ ఐసీయూను ఏర్పాటు చేశామని తెలిపారు. 24 గంటల పాటు నిపుణులైన వైద్యుల బృందం ఇక్కడ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. హాస్పిటల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ నిఖిల్ సుంకరినేని మాట్లాడుతూ, కార్డియాక్ తరహాలోనే అత్యవసర న్యూరో (నరాల సంబంధిత) సమస్యలకు కూడా త్వరితగతిన చికిత్స అందించేలా న్యూరో ఇంటర్వెన్షనల్ కేర్ సేవలను విస్తరించినట్లు తెలిపారు. అక్టోబర్ నెల అంతటా రూ. 999 కే ప్రత్యేక హెల్త్ ప్యాకేజీలు: ఈ ప్రారంభోత్సవం సందర్భంగా అక్టోబర్ నెల అంతటా ప్రత్యేక హెల్త్ ప్యాకేజీలను అందిస్తున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం ప్రకటించింది. కార్డియాక్ ప్యాకేజీ: సాధారణంగా రూ. 10,000 విలువైన ఈ ప్యాకేజీని అక్టోబర్ నెలలో రూ. 999 కే అందిస్తున్నారు. ఇందులో 2D ఎకో (Echocardiogram), ఈసీజీ (ECG), రక్త పరీక్షలు మరియు కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్ ఉంటాయి. న్యూరో ప్యాకేజీ: రూ. 10,000 విలువైన ఈ ప్యాకేజీ కూడా రూ. 999 కే లభిస్తుంది. ఇందులో సీటీ స్కాన్ (బ్రెయిన్), రక్త పరీక్షలు మరియు న్యూరాలజిస్ట్ కన్సల్టేషన్ కలవు. నిఖిల్ హాస్పిటల్స్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అమిత సుంకరినేని మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అత్యాధునిక వైద్యాన్ని సరసమైన ధరల్లో అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు.

# ఎమ్మిగనూరు డివిజన్‌కు నూతన డీఎస్పీని వెంటనే నియమించాలి




**ఎమ్మిగనూరు : సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** ఎమ్మిగనూరు పోలీస్ డివిజన్‌కు నెలలుగా శాశ్వత డీఎస్పీ లేకపోవడంతో బాధిత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమతా సైనిక్ దళ్ రాయలసీమ అధ్యక్షుడు పరమేష్, జిల్లా అధ్యక్షుడు రాముడు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూబదిలీ అయిన డీఎస్పీ స్థానంలో శాశ్వత అధికారిని నియమించకుండా పత్తికొండ డీఎస్పీకి ఎమ్మిగనూరు అదనపు బాధ్యతలు అప్పగించడం వల్ల ప్రజలకు ఉన్నతస్థాయి పోలీసు సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా దళితులు, అట్రాసిటీ కేసుల బాధితులు తమ సమస్యలను డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లేందుకు, కేసుల పురోగతిపై అప్పీల్ చేసేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణలో డీఎస్పీ స్థాయి అధికారి కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, శాశ్వత అధికారి లేకపోవడం వల్ల కేసుల విచారణతోపాటు బాధితులకు న్యాయం అందించడంలో తీవ్ర జాప్యం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్పీ స్థాయి అధికారి స్థానికంగా అందుబాటులో ఉంటే బాధితులు తమ సమస్యలను నేరుగా విన్నవించుకొని, చట్టబద్ధంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని వివరించారు.

పత్తికొండ పోలీస్ డివిజన్ పరిధి ఇప్పటికే విస్తారంగా ఉందని, అలాంటి అధికారికి అదనంగా ఎమ్మిగనూరు బాధ్యతలు అప్పగించడం వల్ల రెండు ప్రాంతాల ప్రజలకు సకాలంలో సేవలు అందించడం క్లిష్టంగా మారుతోందని పేర్కొన్నారు. ఎమ్మిగనూరు డివిజన్‌లో శాంతిభద్రతల పర్యవేక్షణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం, అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం కావాలంటే పూర్తిస్థాయి శాశ్వత డీఎస్పీ నియామకం అత్యవసరమని స్పష్టం చేశారు.జిల్లా ఎస్పీతోపాటు రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఎమ్మిగనూరు పోలీస్ డివిజన్‌కు సమర్థవంతమైన శాశ్వత డీఎస్పీని నియమించాలని వారు డిమాండ్ చేశారు . నియామకంలో మరింత జాప్యం జరిగితే బాధిత ప్రజలు, దళిత సంఘాలతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) నూతన అధ్యక్షురాలుగా నియమితులైన చిగిరింత పారిజాత నరసింహారెడ్డికి శుభాకాంక్షలు




**రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) నూతన అధ్యక్షురాలుగా నియమితులైన చిగిరింత పారిజాత నరసింహారెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. బాలాపూర్ మండలంలోని ఆమె నివాసంలో పలువురు ప్రముఖులు, నాయకులు కలిసి మర్యాదపూర్వకంగా అభినందించారు. ఈ సందర్భంగా బాలాపూర్ జర్నలిస్టులు కామోజీ కృష్ణ, కుందనం రవికిరణ్, కే. సంతోష్‌లతో పాటు పలువురు విలేకరులు ఆమెను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆమె నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా జర్నలిస్టులు కోరారు. జర్నలిస్టుల సన్మానానికి స్పందించిన పారిజాత నరసింహారెడ్డి వారికి ధన్యవాదాలు తెలియజేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

# పాఠశాల స్థాయి లో ఇచ్చే ప్రోత్సాహమే దేశానికి మంచి క్రీడాకారులను అందిస్తుంది



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** హైదరాబాద్ జిల్లా స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో ఇంగ్లీష్ యూనియన్ పాఠశాల, కవాడిగూడకు చెందిన విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. పదవ తరగతికి చెందిన ఇ. రిత్విక్ సాయి అండర్ 17 విభాగంలో కరాటే నందు బంగారు పతకాన్ని, ఏడవ తరగతి విద్యార్థి జి. రామ్ తేజ అండర్ 14 విభాగంలో కరాటే నందు బంగారు పతకాన్ని సాధించారు. చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలకు ఆటలకు ప్రోత్సాహాన్ని ఇస్తూ విద్యార్థులకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తూ గెలుపుకు బాటలు వేస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని, పాఠశాల ప్రిన్స్‌పల్ స్వర్ణలత ఉపాధ్యాయుల కృషిపట్ల విద్యార్థి తల్లిదండ్రులు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

# ఎల్బీనగర్‌లో కొండ లక్ష్మణ్ బాపూజీ గారి 14వ వర్ధంతి



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** కొండ లక్ష్మణ్ బాపూజీ గారి 14వ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ లో బాపూజీ విగ్రహం వద్ద మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్వాతంత్ర సమరయోధుడిగా, సామాజిక కార్యకర్తగా, రాజకీయ నాయకుడిగా, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం పోరాడిన నాయకుడిగా గుర్తింపు పొందారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో బాపూజీ పాల్గొన్నారు . నిజాం నిజాం పాలనలోనే అణిచివేత వెట్టి చాకిరి వంటి దోపిడి విధానాలకి వ్యతిరేకంగా ప్రజల కోసం పోరాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో చులకనగా పోరాడారు. కొండ లక్ష్మణ్ బాపూజీ ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్ గా, పనిచేశారు. అయితే 1969 తెలంగాణ ఉద్యమ సమయంలో మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రత్యేక తెలంగాణ కోసం ఉద్యమంలోకి వచ్చారు. ఆయన ఉద్యాపంలో కూడా ఉద్యమాన్ని నడిపి 2011 సంవత్సరంలోఏడు రోజులు ఢిల్లీలో నిరాహార దీక్ష చేపట్టారు. పదవి కోసం కాదు ప్రజల కోసం, అధికారం కోసం కాదు ఆత్మగౌరవం కోసం, స్వార్థం కోసం కాదు తెలంగాణ కోసం ఎంతోమందిని నీ ధైర్యం విద్యావంతులని మేధావులనే కార్మికులని కవులను రచయితలను ఇంటలెక్చ్యల్స్ ని మే ఉద్యమకారులని ఉద్యమకారులని తెలంగాణ ఉద్యమంలో భాగ్య సాములు చేసిన చరిత్ర కొండ లక్ష్మణ్ బాపూజీ గారిది. ఈ కార్యక్రమంలో బొమ్మ రఘురాం నేత, రామ్ నేత, కేవీ గౌడ్, కోలా భాస్కర్, దేవేందర్ జి, పెద్దపుర బ్రహ్మయ్య, దువ్వాల శ్రీకాంత్, పూస రవి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై రౌడీలను ఎగదోస్తారా?

(1వ పేజీ తరువాయి)

దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ.. కర్నూలు కొండారెడ్డి బురుజు, విజయవాడలో అంబేద్కర్ విగ్రహం, విశాఖ సముద్రం ఒడ్డున టీచర్లు గర్జించారు. కానీ కుక్కతోక వంకర అన్నట్లు గొడ్డలి పార్టీ తీరు మారలేదు. మీడియా ముసుగులో ఓ రిపోర్టర్.. టీచర్‌పై దాడి చేశారంటే వైసీపీ మూకలు ఎంతకు బరితెగించాయో అర్థం చేసుకోండి. ఇలాంటి వాళ్లను ఇంకా ఉపేక్షించాలా? వీరిలాగే కొనసాగితే ఆస్తులకు, ఆడబిడ్డలకు రక్షణ ఉంటుందా' అని ప్రశ్నించారు.

### ఆ ఐదేళ్లలో మామూలు నష్టం కాదు..

2019–24 మధ్య రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని. అది మామూలు నష్టం కాదని సీఎం అన్నారు. నాటి పాలనలో పాలకులే రౌడీయిజం చేశారని.. దారుణాలకు పాల్పడ్డారని చెప్పారు. 'కుప్పం వస్తే నన్ను కూడా ఇబ్బందులు పెట్టారు. దౌర్జన్యాలకు దిగారు. ఓడిపోయిన తర్వాత కూడా చంపడానికైనా, చావడానికైనా సిద్ధం అంటూ రౌడీయిజం చేస్తున్నారు. రౌడీయిజం చేసేవారి తోక కత్తిరిస్తాం' అని హెచ్చరించారు. రౌడీలను, విధ్వంసకారులను తరిమికొట్టే సత్తా కుప్పానికి ఉందన్నారు. ఫ్లెక్సీలకు పొట్టేళ్లు బలిచ్చి రక్తాభిషేకం చేస్తున్నవారిని సైకోలనాలా.. మానసిక రోగులనాలా అని ప్రశ్నించారు.

# రవీంద్రభారతిలో ఘనంగా 'సంగీత నృత్యోత్సవం' - అలరించిన సకల కళల సమ్మేళనం

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం – భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'శ్రీ రాగరమ్య కల్చరల్ ఒ సోషల్ యాక్టివిటీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రవీంద్రభారతి మెయిన్ హాల్‌లో నిర్వహించిన "సంగీత నృత్యోత్సవం – సకల కళల సమ్మేళనం" కార్యక్రమం అత్యంత వైభవంగా, విజయ వంతంగా పూర్తయింది. ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు సాగిన ఈ సాంస్కృతిక వేడుకలలో కళాకారుల ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన కళారత్న, హాస్యబ్రహ్మ, సీనియర్ పాత్రికేయులు డా|| శంకర నారాయణ మాట్లాడుతూ.. సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందన్నారు. అద్భుతమైన ప్రదర్శనలు: సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు రమ్య పర్యవేక్షణలో జరిగిన ఈ ఉత్సవంలో ప్రముఖ గురువుల శిష్యులు తమ కళాప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సంగీత






ప్రదర్శనలు: సంగీత గురువులు కుమారి వేదుల శ్రీ అపర్ణ, శ్రీమతి చందన మనోహర్, శ్రీమతి స్వాతి అనుముగంటి, శ్రీమతి వాసంతి శర్మ శిష్యుల స్వరాలాపనలు వేదికను రంజింపజేశాయి. నృత్య రూపకాలు: నృత్య గురువులు కుమారి సాయి సుప్రజ, కుమారి కీర్తన, కుమారి విజయలక్ష్మి, శ్రీమతి వీరలక్ష్మి, శ్రీమతి శ్రీవిద్య, శ్రీమతి యమునలతో పాటు కొరియోగ్రాఫర్ శ్రీ చందు దర్శకత్వంలో ప్రదర్శించిన నృత్యాలు సభను మురిపించాయి. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న గురువులను, కళాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. వేడుకను విజయవంతం చేసిన అతిథులకు, కళాకారులకు, వీక్షకులకు మరియు సహకరించిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖకు సంస్థ అధ్యక్షురాలు రమ్య ధన్యవాదాలు తెలిపారు.








ఛాయాచిత్రాలు: ఎస్. శ్రీధర్

Printed, Published and Owned by **K.YOUVARAJ** Published at H.No.16-1-427/1, MARUTHI NILAYAM, SAIDABAD, HYDERABAD-59. Printed at ALLAZ PRINTING PRESS H.No. 22-8-147, CHATTA BAZAR, HYDERABAD- 500002, Editor: **K.YOUVARAJ**, RNI No. APTEL/2010/33523, **E-mail: onenation014@gmail.com.**

# ఫలించిన పద్మ కల్పన ఐదు రోజుల నీలి నిరాహార దీక్ష

**అంబేద్కర్ గౌరవాన్ని కాపాడేందుకు ఒంటరి పోరాటం.. ప్రభుత్వ చర్యలకు దారితీసిన దళిత మహిళ దీక్ష**

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్): డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గౌరవాన్ని కించపరిచేలా రచించినట్లు వివాదం నెలకొన్న 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని విడుదల చేయవద్దని, రచయిత హమారా ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దళిత మహిళ పద్మ కల్పన చేపట్టిన ఐదు రోజుల నిరాహార దీక్ష ఫలితాన్ని సాధించింది. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు, అభ్యంతరకరమైన విషయాలతో పుస్తకం రూపొందించడాన్ని వ్యతిరేకిస్తూ పద్మ కల్పన స్వయంగా ముందుకొచ్చి ఐదు రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టారు. దళిత సమాజ హక్కులు, ఆత్మగౌరవం, అంబేద్కర్ విలువలను పరిరక్షించాలనే లక్ష్యంతో ఆమె ఈ పోరాటాన్ని కొనసాగించారు. తన డిమాండ్ల సాధన కోసం ఆమె సచివాలయంలోని ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అదే సమయంలో హైదరాబాద్ విమోచన దినోత్సవ కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయినప్పటికీ తన డిమాండ్‌పై పద్మ కల్పన వెనక్కి తగ్గకుండా పోరాటాన్ని కొనసాగించారు. ఆమె ఐదు రోజుల నిరాహార దీక్షతో పాటు దళిత సంఘాలు, అంబేద్కర్ అభిమానుల నుంచి వచ్చిన నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం హమారా ప్రసాద్‌పై చర్యలు చేపట్టింది. హమారా ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. పుస్తక ప్రతులను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆన్‌లైన్‌లో వాటి విక్రయాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది.



దళిత మహిళగా పద్మ కల్పన చూపిన ధైర్యం

దళిత సమాజ హక్కులు, ఆత్మగౌరవం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ఒక మహిళగా, ఒక దళిత మహిళగా పద్మ కల్పన ముందుకు వచ్చి ఐదు రోజుల పాటు నిరాహార దీక్ష చేయడం ఈ పోరాటంలో ప్రత్యేకంగా నిలిచింది. అంబేద్కర్‌ను అవమానించే విధంగా ఉన్న విషయాలను తాను సహించబోనని స్పష్టం చేస్తూ, పుస్తక విడుదలను అడ్డుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆమె తన పోరాటాన్ని కొనసాగించారు.

పద్మ కల్పన చేపట్టిన ఐదు రోజుల నిరాహార దీక్ష కేవలం ఒక వ్యక్తి పోరాటంగా కాకుండా దళిత సమాజ ఆత్మగౌరవం, అంబేద్కర్ ఆలోచనలు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం సాగిన ఉద్యమంగా నిలిచిందని ఆమెకు మద్దతు తెలిపిన వారు పేర్కొన్నారు. తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా దళిత సమాజ హక్కులు, గౌరవం, భవిష్యత్ తరాల కోసం పద్మ కల్పన పోరాడారని వారు అన్నారు. ఒక మహిళగా ఒంటరిగా ప్రారంభించిన నిరాహార దీక్ష చివరకు ప్రభుత్వ చర్యలకు దారితీయడం ఆమె పట్టుదల, ధైర్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆశయాలు, దళితుల హక్కులు, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేస్తూ ముందుకు సాగుతున్న పద్మ కల్పన పోరాటాన్ని దళిత సమాజం అభినందించింది.



# పర్వతాపూర్ ఎస్సీ స్మశాన వాటికలో బోరు విజయ వంతం...

**- అధికారులకు కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ నాయకుడు తుంగతుర్తి రవి...**



మేడ్చల్ /మేడిపల్లి/సెప్టెంబర్ 22/వన్ నేషన్ : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ డివిజన్ పర్వతాపూర్ ఎస్సీ స్మశాన వాటికలో బోరు ఏర్పాటు పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. బోరు తవ్వకాల్లో నీరు లభించడంతో స్మశాన వాటికకు నీటి సదుపాయం అందుబాటులోకి రానుంది. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

స్మశాన వాటికలో నీటి సమస్యను పరిష్కరించేందుకు బోరు ఏర్పాటు చేయడంలో సహకరించిన డిప్యూటీ కమిషనర్ శైలజ, ఏఈతో పాటు సంబంధిత అధికారులకు 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి స్మశాన వాటికలో నీటి సదుపాయం కల్పించేందుకు అధికారులు చొరవ చూపడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి జలంధర్ రెడ్డి, మేడిపల్లి డివిజన్ ఉపాధ్యక్షుడు యాసారం నగేష్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, యాసారం శ్రీనివాస్, యాసారం సురేష్, యాసారం ప్రభాకర్, యాసారం నరేష్, యాసారం విఘ్నేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు యాసారం సాయికుమార్, బద్దల సురేష్, పాముకుంట్ల లక్ష్మయ్య, మిర్యాల కిరణ్ కుమార్, నానపురం దానయ్య, పర్వతాపూర్ ఎస్సీ స్మశాన వాటిక సభ్యులు, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బోరు విజయవంతంగా పూర్తై నీరు లభించడంపై తుంగతుర్తి రవి సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా అవసరాల కోసం సహకరించిన అధికారులకు మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రైతు బజార్ లో పారిశుద్ధ్య లోపాలు పాడైన కూరగాయల పై కాలు పెట్టి జారిపడి మహిళ కు గాయాలు

## అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



కూకట్‌పల్లి ప్రతినిధి, సెప్టెంబర్ 21 (వన్‌నేషన్): కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ జేఎన్‌టీయూ సమీపంలోని రైతు బజార్‌లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రమాదం చోటుచేసుకుంది రైతు బజార్‌కు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఓ మహిళ అక్కడ నేలపై పేరుకుపోయిన పాడైన కూరగాయలపై కాలు పెట్టడంతో అదుపుతప్పి జారిపడి కిందపడిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో మహిళ వెన్నుపూసకు బలమైన గాయం అయినట్లు సమాచారం ప్రమాదాన్ని గమనించిన అక్కడి వ్యాపారులు, ప్రజలు వెంటనే ఆమెను సమీపంలోని రాందేవ్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించేలా చర్యలు తీసుకున్నారు. రైతు బజార్‌లో పాడైపోయిన కూరగాయలు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ వాటిని సకాలంలో తొలగించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు కూరగాయల కోసం రైతు బజార్‌కు వస్తుంటారని, ఇలాంటి ప్రదేశాల్లో పారిశుద్ధ్య నిర్వహణ నేల శుభ్రత వ్యర్థాల తొలగింపు విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని వారు కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు వెంటనే రైతు బజార్‌ను పరిశీలించి పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచాలని, పాడైన కూరగాయలు మరియు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా రైతు బజార్ లోని నేలపై జారే పదార్థాలు పేరుకు పోకుండా క్రమం తప్పకుండా శుభ్ర పరిచేలా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

# శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలను వెంటనే కూల్చివేయాలి: సిపిఎం



ఎమ్మిగనూరు : సెప్టెంబర్ 21 (వన్‌నేషన్): పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ ప్రాంతంలో కోట్లాది రూపాయలు విలువచేసే ప్రభుత్వ భవనాలు బీసీ హాస్టల్ ఎస్సీ హాస్టల్ అర్బన్ హాస్పిటల్ భవనాలు నేడు శిథిలావస్థలో ఉన్నాయని ఈ భవనాలను తక్షణమే కూల్చివేసి వాటి స్థానంలో ప్రజలకు ఉపయోగపడే విధంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా భవనాలు నిర్మించాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బృంద నాయకులు పట్టణ నాయకులు బి రాముడు కే కృష్ణ సోమవారం ప్రభుత్వాన్ని కోరారు ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గతంలో విద్యార్థులు ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థులకు చాలా సంవత్సరాలుగా ఉపయోగపడిందని కీర్తిశేషులు మాజీ మంత్రివర్యులు బివి మోహన్ రెడ్డి హయాంలో వీరు ఉన్నంతకాలం ఎన్నో వేల మందికి అన్ని విధాల ఉపయోగపడిందని తెలిపారు. నేడు ఈ భవనాలు పూర్తిగా శిథిలావస్థలో పడిపోతున్నాయని ఈ పరిసర ప్రాంతాలలో ఫారెస్ట్ మాదిరిగా ఉన్నదని భవనాలు ఎత్తు ముళ్ళకంపలు ఉన్నాయని సిపిఎం నాయకులు తెలిపారు. నివాస ప్రాంత ప్రజలకు ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని దోమలు పాములు అసాంఘిక కార్యకలాపాల వల్ల తీవ్రంగా అపరిశుభ్రతగా ఉండని దీనివల్ల డెంగు మలేరియా అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని సిపిఎం నాయకులు తెలిపారు. సంబంధిత అధికారులు పరిశీలించి ఈ భవనాలను తక్షణమే కూల్చివేసి ప్రజలకు విద్యార్థులకు ఉపయోగపడే విధంగా జిల్లా కలెక్టర్ , జిల్లా ఇన్చార్జి మంత్రి , స్థానిక అధికారులు పాలకులు, శాసనసభ్యులు ఈ ప్రాంతంలో పర్యవేక్షించి ప్రజలను కాపాడాలని సిపిఎం నాయకులు కోరారు .ఈ పరిశీలన కార్యక్రమంలో సిపిఎం ప్రజా సంఘాల నాయకులు షేక్ మోహిన్, హోటల్ శిక్షావలి, నబిసాబ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# వాలీబాల్, ఖో-ఖో క్రీడల నిర్వహణకు సింగిరెడ్డి పద్మారెడ్డి ఆర్థిక సహాయం



మేడ్చల్ /మేడిపల్లి /సెప్టెంబర్ 21/వన్ నేషన్ : బోడుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ లో ఎస్‌జీఎఫ్ ఘట్కేసర్ జోన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలబాలికల వాలీబాల్, ఖో-ఖో క్రీడల సెలక్షన్స్, టోర్నమెంట్స్‌ను సెప్టెంబర్ 22, 23 తేదీల్లో నిర్వహించ నున్నారు.క్రీడల నిర్వహణ తో పాటు క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాల కల్పన కోసం మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి రూ.20 వేల ఆర్థిక సహా యాన్ని పాఠశాల ప్రధానో పాధ్యాయులు జి. అశోక్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మారెడ్డి మాట్లాడుతూ.. సరైన అవకాశాలు, ప్రోత్సా హం లేక అనేక మంది ప్రతి భావంతులైన క్రీడాకారులు మరుగున పడుతున్నారని అన్నారు. అలాంటి విద్యా ర్థులను వెలుగులోకి తీసు కురావడానికి వాలీబాల్, ఖో-ఖో సెలక్షన్స్, టోర్న మెంట్స్ నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవ డంతో పాటు ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. అశోక్ కుమార్ మాట్లాడు తూ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని విద్యార్థులం దరూ సెలక్షన్స్‌లో అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను నిరూపించు కోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్‌లో మంచి క్రీడా కారులను తయారు చేయా లనే లక్ష్యంతో క్రీడల నిర్వహ ణకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందించిన సింగిరెడ్డి పద్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాజకీయ, వ్యాపార ప్రము ఖులు కూడా ముందుకు వచ్చి విరాళాలు అందించా లని కోరారు.ఈ కార్యక్ర మంలో పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ విద్యాసాగర్, సీనియర్ ఉపాధ్యాయులు పి. వెంకటేశ్వర్, కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి రాజిరెడ్డి, రాము తదితరు లు పాల్గొన్నారు.